

ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు అప్పులు

బెట్టింగ్‌లకు అలవాటు పడ్డారు. అప్పులు చేసి తీర్చేందుకు చోరీబాట పట్టారు. చివరికి పోలీసులకు చిక్కారు. 10లో▸



ముగిసిన స్వచ్ఛత పఖ్వాడ్

దక్షిణమధ్య రైల్వేలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛత పఖ్వాడ్ కార్యక్రమం విజయవంతంగా ముగిసింది. 10లో▸



నిందితులకు రిమాండ్

ధూల్‌పేట్ టక్కరివాడి ప్రాంతంలో జరిగిన హత్యకేసును మంగళ్‌హాట్ పోలీసులు చేధించారు. 10లో▸

న్యూస్‌రీల్

సిద్ధాపూర్‌లో భూసేకరణపై నిగ్గు తేల్చండి

విజిలెన్స్ కమిషనర్‌కు ఎమ్మెల్యే ఫిర్యాదు



విజిలెన్స్ కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

కొత్తూరు: గత ప్రభుత్వం ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు కోసం కొత్తూరు మండలం సిద్ధాపూర్ గ్రామంలో చేసిన భూసేకరణలో అక్రమాలను త్వరలో బయటపెడతామని స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. ఈ మేరకు ఆయన మంగళవారం హైదరాబాద్‌లో విజిలెన్స్ కమిషనర్ జి.గోపాల్‌కు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయడంతో పాటు పలు ఆధారాలు సమర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సిద్ధాపూర్‌లో గత ప్రభుత్వం సేకరించిన భూమిలో 140 ఎకరాలు ఆయా రైతులకు ప్రభుత్వం చేసిన అసైన్డ్ పొలం కాగా మిగతాది ప్రభుత్వ పొలమని రికార్డుల్లో నమోదు చేసినట్లు తెలిపారు. అప్పట్లో ఆయా న్యూస్‌పేపర్లలో 250 మంది రైతుల నుంచి 240 ఎకరాల 16 గుంటల భూమిని సేకరించి వారి ఖాతాల్లో డబ్బులు జమచేసినట్లు నోటిఫికేషన్ జారీ చేసినట్లు తెలిపారు. మొత్తం వ్యవహారంలో సుమారు 80 మంది అనర్హులు కూడా అధికారులు, ప్రజాప్రతినిధుల సహకారంతో పరిహారం పొందినట్లు ఆరోపణలు ఉన్నాయన్నారు. అక్రమాలను త్వరలో విజిలెన్స్ అధికారులు బయటపెడతారని వివరించారు.

గిరిజనులకు న్యాయం చేయండి



డీఆర్‌ఓకు వినతిపత్రం ఇస్తున్న సీపీఐ నాయకులు, తండావాసులు

శంకర్‌పల్లి: మండలంలోని కొండకల్ తండాలో గిరిజన భూములు లాక్కొని ఇతరులకు అమ్మిన భూస్వామిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ మంగళవారం సీపీఐ ఆధ్వర్యంలో తండావాసులు కలెక్టరేట్ ఎదుట నిరసన చేపట్టారు. అనంతరం డీఆర్‌ఓకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి జంగయ్య మాట్లాడుతూ.. కొండకల్ తండాలో విక్రమ్‌రెడ్డి అనే భూస్వామి పేద గిరిజనుల నుంచి వందల ఎకరాలు కొనుగోలు చేసి, అక్కడున్న బిల్లాదాఖల, అసైన్డ్ భూములను కబ్జా చేసి వేల కోట్లకు ప్రైవేటు వ్యక్తులకు అమ్మినట్లు ఆరోపించారు. దీనిపై విచారణ చేపట్టి గిరిజనులకు న్యాయం చేయాలని.. అమాయక ప్రజలను మోసం చేసిన భూస్వామిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర సమితి సభ్యులు పర్వతాలు, రామస్వామి, జిల్లా సమితి సభ్యుడు దత్తు, మండల కార్యదర్శి సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

పేదింటి విద్యార్థిని ఆదుకున్న ఎన్‌ఆర్‌ఐ

కేటీఆర్ చేతుల మీదుగా చెక్కు అందజేత



విద్యార్థిని మేఘనకు చెక్కు అందిస్తున్న మాజీ మంత్రి కేటీఆర్

షాద్‌నగర్‌రూరల్: బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్ఫూర్తితో పేదింటి విద్యార్థిని మెడిసిన్ చదువుకు ఆర్థిక సాయం అందించేందుకు ఎన్‌ఆర్‌ఐ ముందుకు వచ్చారు. షాద్‌నగర్‌కు చెందిన బైరమోని మేఘన అనే విద్యార్థిని మెడిసిన్ ఫస్టియర్ ఫీజును ఎన్ఐఆర్ శ్రీనివాస్ పాట్టి చెల్లించారు. షాద్‌నగర్‌కు చెందిన రమేశ్, మంజుల దంపతులకు మేఘన సహా ముగ్గురు ఆడపిల్లలు. షాద్‌నగర్‌లోని ప్రభుత్వాస్పత్రి వద్ద చిన్న టిఫిన్ సెంటరే ఈ కుటుంబానికి ఆధారం. చదువులో టాపర్ అయిన మేఘన ఇటీవల మెడిసిన్‌లో సీటు సాధించింది. అయితే ఆమె చదువుకు కావాల్సిన ఫీజు కట్టే స్తోమత కుటుంబానికి లేదు. ఈ విషయం కేటీఆర్ దృష్టికి రావటంతో మేఘన చదువుకు సాయం అందిస్తానని మాటిచ్చారు. కేటీఆర్ చేస్తున్న సాయంలో తాను కూడా భాగం అవుతానంటూ ఎన్‌ఆర్‌ఐ శ్రీనివాస్ ముందుకు వచ్చారు. ఈ సందర్భంగా మేఘన కుటుంబ సభ్యులతో కేటీఆర్ మాట్లాడారు. మంగళవారం నందినగర్‌లోని కేసీఆర్ నివాసంలో కేటీఆర్ చేతుల మీదుగా మేఘనకు రూ.40వేల నగదును అందజేశారు. మేఘన ఎంబీబీఎస్ పూర్తయ్యే వరకు తానే ఖర్చులు భరిస్తానని శ్రీనివాస్ హామీ ఇచ్చారు.




రాడార్‌స్టేషన్ శంకుస్థాపనలో రక్షణమంత్రి రాజ్‌నాథ్‌సింగ్, చిత్రంలో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి కొండాసురేఖ, ఎంపీలు డీకే అరుణ, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, స్పీకర్ ప్రసాద్‌కుమార్, కేంద్రమంత్రి బండి సంజయ్, ఎమ్మెల్సీ మహేందర్ రెడ్డి, ఎమ్మెల్యేలు టీఆర్ఆర్, బీఎంఆర్, యాదయ్య

దామగుండం.. కీర్తి పతాకం



దేశ రక్షణకు పునాది

- రాడార్ స్టేషన్ నిర్మాణంతో జాతీయ స్థాయిలో గుర్తింపు
- వీఎల్ఎఫ్‌కు శంకుస్థాపన చేసిన రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్
- ఉపాధి అవకాశాలు పెరుగుతాయన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



మాట్లాడుతున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

వికారాబాద్: రాడార్ స్టేషన్ ఏర్పాటుతో దామగుండం పేరు ఒక్కసారిగా జాతీయ స్థాయిలో వెలుగు వెలిగింది. దేశ కీర్తిపతాకలో వికారాబాద్ జిల్లా మురిసింది. పూడూరు మండలం దామగుండం రిజర్వ్ ఫారెస్ట్‌లో భారత నావికాదళానికి చెందిన వీఎల్ఎఫ్ (వెరీ లో ఫ్రీక్వెన్సీ) రాడార్ స్టేషన్ నిర్మాణానికి తర్జనభర్జన మధ్య పదిహేనేళ్ల అవరోధాలు తొలగి పునాదిరాయి పడింది. రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మంగళవారం శంకుస్థాపన చేశారు. 'దేశ రక్షణలో హైదరాబాద్ ఎంతో వ్యూహాత్మక ప్రదేశం.. కీలకం కూడా.. రక్షణ వ్యవస్థలో ముఖ్యమైన నేవీ రాడార్ స్టేషన్ ఈ ప్రాంతంలో ఏర్పాటు కానుంది.. జాతి రక్షణలో వికారాబాద్ కూడా కీలకం కానుంది' అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. రాడార్ స్టేషన్ ఏర్పాటుతో పర్యావరణానికి ముప్పు వాటిల్లుతుందని, ప్రజలకు నష్టం జరుగుతుందని తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక్కడ నేవీ సంస్థ ఏర్పాటు చేసే విద్యా సంస్థల్లో మూడో వంతు సీట్లు స్థానికులకు కేటాయించాలని రాజ్‌నాథ్‌సింగ్‌కు విజ్ఞప్తి చేశారు. దామగుండం దేవాలయం సెంటిమెంటును గౌరవించాలని కోరారు. భక్తులు ఆలయానికి వెళ్లేందుకు అనుమతి ఇవ్వాలని, వారి విశ్వాసాలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నా. తాను, స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ ఈ జిల్లా వాసుల మేనని ఇక్కడ నేవీ రాడార్ ప్రాజెక్టును ఏర్పాటు చేసుకోవడం గర్వంగా ఉందన్నారు. పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి ఇందుకోసం ఎంతో కృషి చేశారని కొనియాడారు. నావికా దళ ప్రధానాధికారి దినేష్ కే త్రిపాఠి మాట్లాడుతూ.. 2,900 ఎకరాల్లో ఏర్పాటు చేసే వెరీ లో ఫ్రీక్వెన్సీ రాడార్ స్టేషన్ దేశ రక్షణలో ఎంతో కీలకం కానుందన్నారు. ఈ ప్రాజెక్టుతో ఉపాధి అవకాశాలు మెరుగవుతాయే తప్ప ఎలాంటి ఇబ్బందులు ఉండవని స్పష్టం చేశారు.

సంతోషంగా ఉంది: టీఆర్ఆర్

'మన ప్రాంతంలో రాడార్ స్టేషన్ ఏర్పాటుకు నాతోపాటు నేవీ అధికారులు పదిహేనేళ్ల పాటు కృషి చేశారు.. ఇప్పుడు ఆ కల నెరవేరడం సంతోషంగా ఉంది' అని పరిగి ఎమ్మెల్యే టి. రామ్మోహన్ రెడ్డి అన్నారు. అబ్దుల్ కలాం జయంతి రోజున ఈ ప్రాజెక్టును జాతికి అంకితం చేయడం గర్వకారణమన్నారు. ఈ ప్రాజెక్టు ఏర్పాటు మనకు, మన ప్రాంతానికి ఎంతో ఉపయోగకరమన్నారు. కార్యక్రమంలో శాసనమండలి చీఫ్‌విప్ మహేందర్‌రెడ్డి, ఎంపీలు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, డీకే అరుణ, కలెక్టర్ ప్రతీక్‌జైన్, ఎస్పీ నారాయణరెడ్డి, ఎమ్మెల్యేలు కాలె యాదయ్య, మనోహర్‌రెడ్డి, పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ గురునాథ్‌రెడ్డి, అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్, అసిస్టెంట్ కలెక్టర్ ఉమా హారతి, ఆర్డీఓ వాసుచంద్ర, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తిరుపతి రెడ్డి, రమేష్ మహరాజ్, మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, బీజేపీ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి పాల్గొన్నారు.

సైడ్‌లైట్స్..

- కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్, సీఎం రేవంత్‌రెడ్డి హైదరాబాద్ నుంచి ప్రత్యేక హెలికాప్టర్లలో దామగుండం రావాల్సి ఉండగా వాతావరణం అనుకూలించక పోవడంతో రోడ్డు మార్గాన వచ్చారు.
- వికారాబాద్‌కు మధ్యాహ్నం 12.50 గంటలకు చేరుకోవాల్సిన అతిథులు 1.30 గంటలకు చేరుకున్నారు.
- దామగుండం సభాస్థలికి 1.35 గంటలకు వచ్చారు.
- 1.40 గంటలకు రాడార్ స్టేషన్ ఏర్పాటుకు జ్యోతి ప్రజ్వలన చేసి శిలాఫలకం వేశారు.
- 1.50 గంటలకు అతిథుల ప్రసంగాలు మొదలయ్యాయి.
- సీఎం రేవంత్‌రెడ్డి 1.50 నుంచి 2.10 గంటల వరకు ప్రసంగించారు.
- కేంద్రమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ 2.10 నుంచి 2.38 గంటల వరకు ప్రసంగాన్ని కొనసాగించారు.
- సభాస్థలిలోనే భోజనాలు ముగించుకొని అక్కడి నుంచి రోడ్డు మార్గాన వికారాబాద్ కలెక్టరేట్‌కు చేరుకున్నారు. అక్కడి నుంచి హెలికాప్టర్‌లో హైదరాబాద్‌కు బయలుదేరి వెళ్లారు.
- ముందుగా రాజ్‌నాథ్‌సింగ్ ఆర్మీ హెలికాప్టర్‌లో బయలుదేరగా ఆ తర్వాత నేవీ అధికారులు మరో ఆర్మీ హెలికాప్టర్‌లో వెళ్లారు.
- సీఎం రేవంత్‌రెడ్డి, స్పీకర్ ప్రసాద్‌కుమార్, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి మరో ప్రత్యేక హెలికాప్టర్‌లో హైదరాబాద్‌కు బయలుదేరి వెళ్లారు.
- 350 మంది సివిల్ పోలీసులు, 150 మంది ఇతర పోలీసులు, 28 మంది ఆర్మీ సిబ్బంది భద్రతా ఏర్పాట్లు చేశారు. ఎస్పీ నారాయణరెడ్డి దగ్గరుండి ఏర్పాట్లను పర్యవేక్షించారు.



కార్యక్రమానికి హాజరైన నేవీ అధికారులు, నాయకులు, స్థానికులు

రోడ్డు మార్గాన వచ్చి.. ఆకాశ మార్గాన పయనం

అనంతగిరి/పూడూరు: నేవీ రాడార్ స్టేషన్ శంకుస్థాపన కార్యక్రమానికి రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్, సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక హెలికాప్టర్‌లో వికారాబాద్‌కు రావాల్సి ఉండగా వాతావరణం అనుకూలించకపోవడంతో హైదరాబాద్ నుంచి రోడ్డు మార్గాన దామగుండం చేరుకున్నారు. విషయం తెలుసుకున్న పోలీసు అధికారులు హుటాహుటిన భద్రత ఏర్పాట్లలో మార్పులు చేశారు. శంకుస్థాపన ముగిసిన తర్వాత హైదరాబాద్ వెళ్తున్న అతిథులకు కలెక్టర్ ప్రతీక్‌జైన్, మల్టీజోన్ -2 ఐజీ సత్యనారాయణ, ఎస్పీ నారాయణరెడ్డి, అడిషనల్ కలెక్టర్లు, ట్రైనీ కలెక్టర్ ధన్యవాదాలు తెలిపారు.

తప్పులు సరిచేస్తానని..

- పానుపుస్తకంలో సవరణకు డబ్బులు డిమాండ్
- ఓ రికార్డు అసిస్టెంట్ నిర్వాకం
- తహసీల్దార్‌కు బాధిత రైతు ఫిర్యాదు

షాద్‌నగర్: 'పట్టాదారు పాసుపుస్తకంలో తప్పులు వచ్చాయి.. సరిదిద్దండి సారూ' అంటూ ఓ రైతు అధికారికి మొరపెట్టుకున్నాడు.. ఇదే అవకాశంగా సదరు అధికారి డబ్బులు వసూలు చేశాడు.. అయినా పనికాకపోవడంతో బాధిత రైతు ఉన్నతాధికారికి ఫిర్యా దు చేశాడు. వివరాలు ఇలా ఉన్నాయి. ఫరూఖ్‌నగర్ మండలం బూర్గులకు చెందిన కావలి అంజయ్యకు గ్రామ శివారులోని సర్వే నంబర్ 575లో 2.17 ఎకరాల భూమి ఉంది. పట్టాదారు పాసుపుస్తకంలో తప్పులు సరిచేయాలని సదరు రైతు ఫరూఖ్‌నగర్ తహసీల్దార్ కార్యాలయంలో రికార్డు అసిస్టెంట్‌గా పని చేస్తున్న బూర్గుల గ్రామానికి చెందిన పోలె నరేందర్‌ను ఆశ్రయించాడు. దీంతో తప్పులను సరి చేసేందుకు అతను భారీ ఎత్తున డబ్బులు డిమాండ్ చేశాడు. ఈ మేరకు రైతు రూ.6.42 లక్షలు సమర్పించుకున్నాడు. ఆరు నెలలు కావస్తున్నా పనికాకపోవడం.. ఇచ్చిన డబ్బులు తిరిగి ఇవ్వకపోవడంతో తిరిగితిరిగి వేసారిన రైతు చేసేది లేక మంగళవారం తహసీల్దార్‌కు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశాడు. పాసుపుస్తకంలో తప్పులను సవరించాలని, పోలె నరేందర్ నుంచి డబ్బులు తిరిగి ఇప్పించి ఆయనపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈ విషయమై ఫరూఖ్‌నగర్ తహసీల్దార్ పార్థసారధిని వివరణ కోరగా రైతు ఫిర్యాదుపై విచారణ చేపట్టి ఆర్డీఓ, కలెక్టర్‌కు నివేదిస్తానని తెలిపారు.

కొలువుల్లో కొత్త సార్లు

డీఎస్సీలో ఎంపికైన అభ్యర్థులకు పోస్టింగ్‌లు



సాక్షి, సిటీబ్యూరో: గ్రేటర్ పరిధిలోని మూడు జిల్లాల్లో కొత్తగా ఎంపికైన ప్రభుత్వ ఉపాధ్యాయులకు పోస్టింగ్ లభించింది. డీఎస్సీ-2024లో ఎంపికై నియామక పత్రాలు అందుకున్న అభ్యర్థులకు మంగళవారం కౌన్సెలింగ్ ప్రక్రియ ద్వారా విద్యాశాఖ పోస్టింగ్‌లను కేటాయించింది. హైదరాబాద్ జిల్లాలో 584 మంది అభ్యర్థులకు ప్రభుత్వ పాఠశాలల్లో పోస్టింగ్‌లు ఇచ్చారు. వీరంతా బుధవారం నుంచి విధుల్లో చేరనున్నారు. దీంతో ప్రభుత్వ పాఠశాలల్లో ఇక ఉపాధ్యాయుల కొరత తీరనుంది.

- హైదరాబాద్ జిల్లాలో మొత్తం 878 పోస్టులకుగాను కోర్టు కేసులు, రిజర్వేషన్ కేటగిరీలో అభ్యర్థుల కొరత, ఇన్ సర్వీస్ తదితర కారణాలతో సుమారు 262 పోస్టులకు అభ్యర్థుల ఎంపిక పెండింగ్‌లో పడింది. మిగతా 616 పోస్టులకు అభ్యర్థులను ఎంపిక చేసినప్పటికీ ధ్రువీకరణ పత్రాల రీ వెరిఫికేషన్‌తో 32 మంది అభ్యర్థులకు నియామక పత్రాలు నిలిపివేశారు. మొత్తం మీద 584 మంది అభ్యర్థులకు మాత్రమే నియామక పత్రాలను అందజేశారు. అందులో 386 ఎస్జీటీ, 107 ఎస్ఏ, 91 ఎల్పీ అభ్యర్థులకు పోస్టింగ్‌లు లభించాయి.
- మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో మొత్తం 109 ఖాళీలకు పరీక్ష నిర్వహించగా 82 మంది టీచర్లుగా ఎంపికయ్యారు. వీరందరికి మంగళవారం కౌన్సెలింగ్ ద్వారా అధికారులు పాఠశాలలను కేటాయించారు. పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య ఆధారంగా నియామకాలు చేపట్టినట్లు తెలుస్తోంది. విద్యార్థులు ఉండి ఉపాధ్యాయుల కొరత ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో ఆ సమస్య తీరే అవకాశముంది. డీఎస్సీ-2024లో టీచర్లుగా ఎంపికైన అభ్యర్థులకు కౌన్సెలింగ్ ద్వారా పాఠశాలలను కేటాయించామని, వీరంతా బుధవారం నుంచి వారికి కేటాయించిన పాఠశాలల్లో విధుల్లో చేరుతారని డీఈఓ వెల్లడించారు.
- రంగారెడ్డి జిల్లాలో మొత్తం 334 మంది అభ్యర్థులకు అధికారులు పోస్టింగ్‌లు ఇచ్చారు. కొంగరకలాన్‌లోని కలెక్టరేట్‌లో మంగళవారం నిర్వహించిన కౌన్సెలింగ్‌కు అభ్యర్థులు హాజరై నియామక పత్రాలు అందుకున్నారు. వీరంతా కేటాయించిన పాఠశాలల్లో బుధవారం చేరుతారు.

విద్యుత్ శాఖలో బది'లీలలు'

- హెచ్ఆర్‌ఏ కోసం పక్కదారి
- రూ.లక్షల్లో చేతులు మారినట్లు ఆరోపణలు
- ఓ ఉన్నతాధికారి నిర్వాకంతో ఉద్యోగులకు అన్యాయం
- అర్హత ఉన్నా ఏళ్లతరబడి గ్రామీణ ప్రాంతంలోనే విధులు



తుక్కుగూడ విద్యుత్ కార్యాలయం

మహేశ్వరం/తుక్కుగూడ: విద్యుత్ శాఖలో ఇటీవల చేపట్టిన బదిలీల్లో అక్రమాలు జరిగినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. కందుకూరు డివిజన్ కింద ఆమనగల్లు, తల్లకొండపల్లి, మాడ్గుల, మహేశ్వరం, కడ్తాల్, పహాడీ షరీఫ్, బాలాపూర్ మండలాలు వస్తాయి. ఈ డివిజన్ పరిధిలో 40 మంది లైన్‌మెన్లు, 15 మంది లైన్ ఇన్‌స్పెక్టర్లు పని చేస్తున్నారు. నిబంధనల ప్రకారం ప్రతి మూడేళ్లకు ఒకసారి ఉద్యోగులు బదిలీ కావాల్సి ఉంది. ఇందులో గ్రామీణ ప్రాంతంలో పని చేసే వారిని అర్బన్‌కి హెచ్ఆర్ఏ (హౌస్ రెంట్ అలవెన్స్) వచ్చే ప్రదేశానికి, అర్బన్ నుండి గ్రామీణ ప్రాంతాలకు బదిలీ చేయాలి.

'అర్బన్' కోసం అడ్డదారులు

ఈ డివిజన్‌లో పని చేసే వారిలో ఆశాఖ కందుకూరు డీఈఈ ఈ నెల 11న 13 మంది లైన్‌మెన్లు ఏడుగురు లైన్ ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేశాడు. వీరు ఈ ఏడాది మేలోనే బదిలీ కావాల్సి ఉండగా ప్రభుత్వ నిర్ణయం కారణంగా జాప్యం అయ్యింది. వీరిలో ఆరుగురు లైన్‌మెన్లు, ఐదుగురు లైన్‌ఇన్‌స్పెక్టర్లు అర్బన్ నుంచి గ్రామీణ ప్రాంతానికి బదిలీ కావాలి ఉంది. కానీ వీరు హెచ్ఆర్ఏ కోసం అర్బన్ ప్రాంతానికి బదిలీ చేయించుకున్నారు. ఇందు కోసం లక్షల రూపాయలు చేతులు మారినట్లు తెలుస్తోంది. ఒక్కో ఉద్యోగి నుంచి రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షలు వసూలు చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అధికారులు కాసులకు కక్కుర్తి పడి తీసుకున్న నిర్ణయం మూలంగా గ్రామీణ ప్రాంతంలో పని చేస్తున్న సీనియర్ ఉద్యోగులు నష్టపోతున్నారు. ఇటీవల బదిలీ అయిన ఉద్యోగుల్లో చాలామంది పదేళ్ల నుంచి అర్బన్ ప్రాంతంలో పని చేస్తూ.. తిరిగి అక్కడికే ట్రాన్స్‌ఫర్ కావడం విశేషం.

ఉద్యోగుల ఆగ్రహం

కందుకూరు డివిజన్‌లో బదిలీలపై విద్యుత్ ఉద్యోగ సంఘాల నాయకులు, బదిలీ అయిన ఉద్యోగులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం బదిలీలు జరగలేదని విమర్శిస్తున్నారు. బదిలీల్లో పైరవీలకు పెద్దపీట వేసినట్లు ఆరోపిస్తున్నారు. హెచ్ఆర్ఏ నుంచి నాన్ హెచ్ఆర్ఏకు బదిలీ చేయాలని, దానికి విరుద్ధంగా బదిలీ చేసినట్లు మండిపడుతున్నారు. డీఈఈ రాజారాంరెడ్డి ఏకపక్షంగా వ్యవహరించారని, తనకు నచ్చిన వారికి .. వారు కొరుకున్న చోటకు బదిలీలు చేపట్టారని కొంత మంది ఉద్యోగులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

నిబంధనలకు వ్యతిరేకం

కందుకూరు డివిజన్‌లో ఇటీవల జరిగిన బదిలీలు నిబంధనలకు వ్యతిరేకంగా ఉన్నాయి. గ్రామీణ ప్రాంతంలో పని చేసే వారు అర్బన్‌కి రావాల్సి ఉన్నప్పటికీ రాలేకపోయారు. ఉన్నతాధికారి అర్బన్ ప్రాంతంలో పని చేసే వారి నుంచి లక్షలు వసూలు చేసి మాకు అన్యాయం చేశారు.

– కుమార్, ఐఎన్‌టీయూసీ 327 యూనియన్ రీజినల్ అధ్యక్షుడు

పారదర్శకంగా చేపట్టాం

ప్రభుత్వ ఉత్తర్వులు, నిబంధనల ప్రకారమే బదిలీలు చేపట్టాం. ఇందులో ఎలాంటి తప్పిదం లేదు. ఎలాంటి అవకతవకలు జరగలేదు. కొంత మందికి వారు కోరుకున్న చోట రానందుకు అసంతృప్తి వ్యక్తం చేయడం సాధారణం. ఆరోపణలు పూర్తిగా అవాస్తవం.

– పి.రాజారాం రెడ్డి, డీఈఈ, కందుకూరు డివిజన్

వేర్వేరు కేసుల్లో ఇద్దరికి రిమాండ్



సీహెచ్. కోటేశ్



బుర్ర రాము

చేవెళ్ల: రెండు వేర్వేరు కేసుల్లో ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసిన చేవెళ్ల పోలీసులు మంగళవారం వారిని రిమాండ్‌కు తరలించారు. ఈ ఘటనలు చేవెళ్ల ఠాణా పరిధిలో సోమవారం చోటుచేసుకున్నారు. ఈ వివరాలు ఎస్ఐ శ్రీకాంత్‌రెడ్డి విలేకరుల సమావేశంలో వెల్లడించారు.

కల్లు దుకాణం యజమానిపై దాడి కేసులో..

మండల పరిధిలోని కుమ్మెర గ్రామంలో బండ్లగూడకు చెందిన బుర్ర సత్తయ్య కల్లు దుకాణం నిర్వహిస్తున్నాడు. రోజు మాదిరిగానే సోమవారం కల్లు అమ్ముతుండగా గ్రామానికి చెందిన సీహెచ్.కోటేశ్ వచ్చి తాగి డబ్బులు ఇచ్చాడు. అనంతరం ఆయనకు రావాల్సిన ఇవ్వలేదంటూ సత్తయ్యతో గొడవ పడి పక్కనే ఉన్న కల్లు సీసాను పగులగొట్టి తల, చేతిపై దాడి చేశాడు. గ్రామానికి చెందిన నరేశ్, కుమార్ గమనించి వారిని వారించి సత్తయ్యను చేవెళ్ల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. క్షతగాత్రుడి బంధువు రాఘవేందర్ ఫిర్యాదు మేరకు పోలీసులు కోటేశ్‌ను రిమాండ్‌కు తరలించారు.

బిర్యానీ టోకెన్ విషయంలో..

మండల కేంద్రంలోని షాబాద్ చౌరస్తా వద్ద ఉన్న ఎంజీ హోటల్‌కు సోమవారం రాత్రి హోటల్ ఎదురుగా ఉండే చికెన్ సెంటర్‌కు చెందిన బుర్ర రాము బిర్యానీ కోసం వచ్చాడు. కౌంటర్‌పై ఉన్న సయ్యద్ ఒమర్ ఫయాజ్‌ను టోకెన్ ఇవ్వమని కోరాడు. అందుకు గతంలో తీసుకున్న బిర్యానీ డబ్బు చెల్లించమని అడిగాడు. దీంతో గొడవ ముదిరింది. అక్కడ పనిచేసే ఇమ్రాన్ అడ్డురావడంతో అతనితోనూ గొడవపడి హోటల్‌లోని వస్తువులను చిందరవందరగా పడేశాడు. టోకెన్ ఇవ్వకుంటే చంపేస్తానని బెదిరించాడు. దీంతో ఒమర్ ఫయాజ్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో రామును రిమాండ్‌కు తరలించారు.

డెస్కుల తయారీలో నాణ్యత పాటించాలి

చంచల్‌గూడ: ప్రభుత్వ పాఠశాలలకు సరఫరా చేయాల్సిన డ్యుయల్ డెస్క్ తయారీలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ అన్నారు. మంగళవారం ఆయన చంచల్‌గూడ జైలులోని తయారీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. డ్యూయల్ డెస్క్ తయారీలో నాణ్యత పాటించాలని జైలు సూపరింటెండెంట్ నవాబు శివకుమార్‌గౌడ్‌కు సూచించారు. త్వరతగతిన డెస్కులు తయారు చేసి పాఠశాలలకు సరఫరా చేయాలన్నారు. క్వాలిటీ కంట్రోల్ అధికారులు డెస్కులను పరిశీలించిన తర్వాతే పాఠశాల హెచ్ఎంలు డెస్కులు తీసుకెళ్లాలన్నారు. ప్రతి రోజూ డెస్కుల తయారీ వివరాలను గూగుల్ షీట్‌లో పొందుపరచాలని జైలు అధికారులను ఆదేశించారు. ఎక్కువ విద్యార్థులు ఉన్న పాఠశాలలకు ప్రాధాన్యం ఇస్తూ త్వరగా సరఫరా చేయాలని కలెక్టర్ కోరారు.

డిగ్రీ కాలేజీలో పనుల పరిశీలన..

అనంతరం కలెక్టర్ అనుదీప్ సమీపంలోని నూతన డిగ్రీ కాలేజీని స్థానిక మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బిన్ అబ్దుల్ బలాలతో కలిసి సందర్శించారు. రూ. 5 కోట్లతో నిర్మిస్తున్న ప్రభుత్వ జూనియర్ కాలేజీ పనులను పరిశీలించారు. నిర్మాణం వేగవంతం చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. డిగ్రీ కాలేజీలో ఫ్లోరింగ్, కిటికీలు తదితర ఏర్పాటు పూర్తి చేయాలని సూచించారు. విద్యార్థుల హాజరు శాతం పెంచేలా అధ్యాపకులు చర్యలు తీసుకోవాలన్నారు.

కూలీ బలవన్మరణం



మల్లేశ్ మృతదేహం

మీర్‌పేట: మద్యానికి బానిసైన ఓ కూలీ బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన మీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ సుధాకర్ తెలిపిన ప్రకారం.. పెంజర్ల గ్రామానికి చెందిన కె.మల్లేశ్ సెప్టెంబర్ 7 నుంచి బడంగ్‌పేటలో ఒంటరిగా నివాసం ఉంటూ.. కూలీ పనులు చేసుకుంటున్నాడు. ఈ క్రమంలో మద్యానికి బానిసైన ఆయన సోమవారం రాత్రి ఇంట్లోని దూలానికి తాడుతో ఉరేసుకున్నాడు. స్థానికుల సమాచారం ఆధారంగా మంగళవారం పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని శవాన్ని పోస్టుమార్టానికి తరలించారు. మృతుడి సంబంధీకులుంటే ఠాణాలో సంప్రదించాలన్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

జలమండలిలో సమ్మె నిషేధం

సాక్షి,సిటీబ్యూరో: జలమండలి మరో ఆరునెలల పాటు సమ్మెలను నిషేధిస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. నీటి సరఫరా, పారిశుద్ధ్యం అత్యంత అవసరమైన సర్వీసులు కావడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొంది. ఈ ఏడాది ఏప్రిల్ 21న ఆరు నెలల పాటు సమ్మెలపై నిషేధం విధిస్తూ ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులకు ఈ నెల 20తో గడువు ముగియనుండటంతో మరో ఆరు నెలల పాటు నిషేధాన్ని పొడిగిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈనెల 21నుంచి ఆరు నెలల పాటు సమ్మె నిషేధం అమల్లో ఉంటుందని ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు.

ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు అప్పులు

తీర్చేందుకు చోరీలు

- వృద్ధురాలిపై దాడి చేసి నగలు ఎత్తుకెళ్లిన దుండగుల అరెస్ట్
- పది తులాల బంగారు ఆభరణాలు, కారు, ఐఫోన్ సీజ్
- కేసు వివరాలు వెల్లడించిన ఏసీపీ కేపీవీ రాజు



కేసు వివరాలను వెల్లడిస్తున్న ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు, ముసుగులో నిందితులు

ఇబ్రహీంపట్నం: జల్సాలకు, బెట్టింగ్‌లకు అలవాటు పడిన యువకులు అప్పులు చేసి.. వాటిని తీర్చేందుకు చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు నిందితులను గ్రీన్‌ఫార్మాసిటీ పోలీసులు అరెస్ట్ చేశారు. ఇబ్రహీంపట్నం ఏసీపీ కార్యాలయంలో గ్రీన్ ఫార్మాసిటీ పీఎస్ సీఐ కృష్ణంరాజు, ఎస్ఐ తేజంరెడ్డితో కలిసి మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏసీపీ కేపీవీ రాజు కేసు వివరాలు వెల్లడించారు. సూర్యాపేట జిల్లా జాజిరెడ్డిగూడెం మండలం, రామన్నగూడెం గ్రామానికి చెందిన బీటెక్ థర్డ్ ఇయర్ విద్యార్థి ఊట్కూరి ప్రభాస్(20) అబ్దుల్లాపూర్‌మెట్ మండలం పెద్ద అంబర్‌పేట్ పరిధిలోని మైత్రి లహరి కాలనీలో నివాసం ఉంటున్నాడు. ఆయనకు నల్గొండ జిల్లా శాలిగౌరారం మండల కేంద్రానికి గుండ్లపల్లి శివ(19)తో ఇన్‌స్టాగ్రాంలో ఏర్పడిన పరిచయం స్నేహంగా మారింది. జల్సాలకు, ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు పాల్పడి అప్పుల పాలయ్యారు. వీటిని తీర్చేందుకు చోరీలకు పాల్పడాలని నిర్ణయించుకున్నారు. ఈ నెల 10న కొహెడ గ్రామంలో ఓ కారును అద్దెకు తీసుకుని కందుకూరు మండలం ఆకులమైలారం గ్రామంలో ఒంటరిగా ఉంటున్న దేవరశెట్టి సమతమ్మ వృద్ధురాలి ఇంట్లోకి ప్రవేశించారు. ఆమె నోరు మూసి ఆమె మెడలోంచి బంగారు పుస్తెలతాడు, చేతులకున్న బంగారు గాజులు లాక్కొని పారిపోయారు. ఆమె వెంటనే డయల్ 100కు సమాచారం ఇవ్వగా డీసీపీ సునీతా రెడ్డి ఆదేశాల మేరకు ఏసీపీ పరిధిలోని ఆరు స్టేషన్ల క్రైం సిబ్బందిని అప్రమత్తం చేసి గాలింపు చర్యలు చేపట్టారు. కారు కోహెడ గ్రామానికి చెందినదిగా గుర్తించి దర్యాప్తు చేపట్టి ప్రభాస్, శివను అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి ఆరుతులాల పుస్తెల తాడు, నాలుగు తులాల బంగారు గాజులు, కారు, కత్తెర, ఐఫోన్ స్వాధీనం చేసుకున్నారు. కేసును ఛేదించిన సీఐ, ఎస్ఐలతోపాటు సిబ్బంది సుందరయ్య, ఇంతియాజ్, శేఖర్, శ్రీను, ప్రభును ఏసీపీ అభినందించి రివార్డులను అందజేశారు.

పిల్లలపై తల్లిదండ్రులు దృష్టిసారించాలి

ఉన్నత విద్యావంతులే చోరీలకు పాల్పడుతుండడం ఆందోళన కలిగిస్తోంది. ఇబ్రహీపం ఏసీపీ పరిధిలో చోటు చేసుకున్న మూడు చోరీల్లో నిందితులంతా ఉన్నత విద్యను అభ్యసించిన వారే. జల్సాలు, ఆన్లైన్ బెట్టింగ్‌లకు అలవాటు పడి అప్పులపాలవుతున్నారు. తల్లిదండ్రులు పిల్లల నడవడిక, ప్రవర్తనపై దృష్టి సారించాలి. అపరిచిత వ్యక్తులు రాత్రిళ్లు తలుపుతడితే తీయొద్దు. పక్కింటి వారికి, డయల్ 100కు సమాచారం ఇవ్వాలి.

– కేపీవీ రాజు, ఏసీపీ, ఇబ్రహీంపట్నం

పగలు రెక్కీ.. అర్ధరాత్రి పశువుల చోరీ

ఇద్దరు నిందితులకు రిమాండ్

షాద్‌నగర్‌రూరల్: పగటిపూట బైక్‌పై వ్యవసాయ క్షేత్రాల వద్ద రెక్కీ నిర్వహిస్తూ అర్ధరాత్రి పశువులను తరలిస్తున్న ఇద్దరు నిందితులను మంగళవారం పోలీసులు రిమాండ్‌కు తరలించారు. పట్టణ సీఐ విజయ్ కుమార్ తెలిపిన ప్రకారం.. ఫరూఖ్‌నగర్ మండలం గంట్లవెల్లి గ్రామానికి చెందిన నందిగామ శ్రీధర్, వడ్ల శివకుమార్ కొంతకాలంగా పశువులను దొంగతనం చేస్తున్నారు. ఇటీవల వీరు ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని ఎల్లంపల్లి, వెల్జర్ల, కేశంపేట మండలం వేములనర్వ గ్రామాల్లో వ్యవసాయ పొలాల వద్ద కట్టేసిన పశువులను దొంగతనం చేశారు. ఈ నెల 10న వెల్జర్లకు చెందిన రైతు గడ్డం రాఘవేందర్‌కు చెందిన పశువులు దుండగులు ఎత్తుకెళ్లినట్లు గుర్తించిన ఆయన 11న పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేపట్టిన పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి మూడు ఆవులు, లేగ దూడ, టాటా ఏస్ వాహనంతో పాటుగా రెక్కీకి ఉపయోగించే బైక్‌ను స్వాధీనం చేసుకుని నిందితులను రిమాండ్‌కు తరలించారు.

పొలంలో పడి యువకుడి మృతి



ప్రశాంత్(ఫైల్)



ప్రశాంత్ మృతదేహం

మొయినాబాద్: భార్య పుట్టింటికి వెళ్లిపోయిందని మనస్థాపానికి గురైన ఓ యువకుడు పొలంలో పడి మృతి చెందాడు. ఈ ఘటన మండల పరిధిలోని నాగిరెడ్డిగూడలో మంగళవారం చోటు చేసుకుంది. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన గొరెల్లి ప్రశాంత్(25)కు ఐదేళ్ల క్రితం వివాహమైంది. కుటుంబతగాదాల కారణంగా మూడేళ్ల క్రితం భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో అప్పటి నుంచి ప్రశాంత్ మద్యానికి బానిసయ్యాడు. పదేళ్ల క్రితం ఆయన తల్లి మరణించింది. అప్పుడప్పుడు ప్రశాంత్ తల్లి సమాధి వద్దకు వెళ్లి వచ్చేవాడు. మంగళవారం మధ్యాహ్నం సైతం సమాధి వద్ద కాసేపు ఉండి తిరిగి వస్తుండగా గట్టుపై నుంచి జారి బోర్లా పడిపోయి మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలికి చేరుకున్నారు. వివరాలు సేకరించి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని చేవెళ్ల ప్రభుత్వాస్పత్రికి తలరించారు. మద్యం మత్తులో ఉన్న ప్రశాంత్ బోర్లాపడిపోయి ఊపిరాడక మృతి చెంది ఉంటాడని గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

కిడ్నాప్ కేసులో నిందితులకు రిమాండ్

కద్తాల్: వ్యాపారిపై దాడి చేసి కిడ్నాప్‌నకు పాల్పడిన దుండగులను పోలీసులు అరెస్ట్ చేసిన రిమాండ్‌కు తరలించారు. కేసు వివరాలను మంగళవారం సీఐ శివప్రసాద్ విలేకరులకు వెల్లడించారు. ఈ ఘటనకు ఇద్దరి వ్యాపారుల మధ్య లావాదేవిలే కారణంగా తేల్చారు. వనపర్తి జిల్లా పానగల్ మండలం రేమద్దుల గ్రామానికి చెందిన వ్యాపారి పిట్ల కతల్ హైదరాబాద్‌లోని కొండాపూర్‌లో నివాసం ఉంటున్నాడు. ఈ నెల 5న శనివారం నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ పోలీస్‌స్టేషన్‌లో ఓ కేసు నిమిత్తం వ్యాపారి కతల్‌తో పాటుగా ఆయన కుమారుడు శ్యామ్‌కుమార్, బావమరిదితో కలిసి వెల్దండ పీఎస్‌కు బయలుదేరారు. పని చూసుకుని తిరిగి వెళ్తుండగా మార్గమధ్యలోని శ్రీశైలం–హైదరాబాద్ జాతీయ రహదారిపై కడ్తాల్ టోల్ ప్లాజా వద్ద బద్రి అలియాస్ అన్వేశ్, అఫ్రోజ్, సురేశ్, కొండల్‌లు వారి కారును ఆపి రాళ్లతో దాడి చేశారు. కతల్‌ను కారు నుంచి బయటకు ఈడ్చి విచక్షణారహితంగా దాడి చేసి దుండగులు ముందే సిద్ధం చేసుకున్న కారులో ఎక్కించుకుని కిడ్నాప్ చేశారు. ఈ కిడ్నాప్ వెనుక వావిళ్ల సంజీవ్‌కుమార్ హస్తం ఉందని కతల్ కుమారుడు శ్యామ్‌కుమార్ వెంటనే కడ్తాల్ ఠాణాలో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సీఐ శివప్రసాద్ ఆధ్వర్యంలో దర్యాప్తు చేపట్టారు. ఈ నెల 6న నిందితులు ఏ2 అన్వేశ్ అలియాస్ బద్రి(చంద్రయాన్‌పల్లి), ఏ3 నిజాముద్దీన్(లింగారెడ్డిపల్లి), ఏ4 మహ్మద్ అఫ్రోజ్(లింగారెడ్డిపల్లి), ఏ6 సూగూరి సురేశ్(చంద్రయాన్‌పల్లి)ను రిమాండ్‌కు తరలించారు. కిడ్నాప్‌నకు వాడిన కారును స్వాధీనం చేసుకున్నామన్నారు. ఏ1 నిందితుడు వావిళ్ల సంజీవ్‌కుమార్(పోతేపల్లి), ఏ5 కోడెల కొండల్ (బర్కట్‌పల్లి గ్రామం)ను ఈనెల 14న రాత్రి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

సైబర్ బాధితుడికి నగదు అప్పగింత

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసుల చొరవతో ఓ సైబర్ నేరం బారిన పడిన వ్యక్తికి ఊరట లభించింది. బాధితుడి నుంచి నేరగాళ్ల ఖాతాల్లోకి వెళ్లిన మొత్తం నుంచి రూ.39 లక్షలు వెనక్కు రప్పించి, తిరిగి ఇప్పించగలిగినట్లు డీసీపీ దార కవిత మంగళవారం తెలిపారు. నగరానికి చెందిన యువకుడిని సంప్రదించిన సైబర్ నేరగాళ్లు స్టాక్ ట్రేడింగ్‌లో భారీ లాభాలంటూ ఎర వేశారు. అతడిని పూర్తిగా నమ్మించిన నేరగాళ్లు రూ.78,70,500 వివిధ బ్యాంకు ఖాతాల్లో డిపాజిట్ చేయించారు. ఎట్టకేలకు తాను మోసపోయినట్లు గుర్తించిన బాధితుడు సిటీ సైబర్ క్రైమ్ పోలీసులకు ఆశ్రయించారు. ఇన్‌స్పెక్టర్ కె.మధుసూదన్‌రావు, కానిస్టేబుళ్లు వెంకటేష్, సంపత్ తక్షణం స్పందించి ఆయా బ్యాంకు అధికారులను లేఖలు రాశారు. దుండగుల ఖాతాల్లోని నగదు ఫ్రీజ్ చేయాల్సిందిగా కోరడంతో పాటు వారిని సంప్రదించి విషయం వివరించారు. దీంతో అప్పటికే సైబర్ నేరగాళ్లకు కొంత మొత్తం చేరగా.. రూ.39 లక్షలు ఫ్రీజ్ అయ్యాయి. ఈ మొత్తాన్ని కోర్టు ద్వారా బాధితుడికి అందించారు.

మెట్రో స్టేషన్‌లో ప్రయాణికుల నగలు, నగదు మాయం

బంజారాహిల్స్: మెట్రో స్టేషన్‌లో ప్రయాణికుల నగదు, నగలు మాయమైన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. హన్మకొండకు చెందిన శోభలత, హేమలత అనే ఇద్దరు అక్కాచెల్లెళ్లు ఈ నెల 10న ఎల్వీప్రసాద్ ఆస్పత్రికి కంటి పరీక్షలకు వచ్చి మధ్యాహ్నం రోడ్డునెంబర్–5లోని మెట్రోస్టేషన్‌లో రైలు ఎక్కే క్రమంలో బ్యాగ్‌లను స్కాన్ చేయించారు. అదే రోజు రాత్రి 8 గంటలకు హన్మకొండకు చేరుకున్న తర్వాత బ్యాగ్‌ను తెరిచి చూడగా అందులో రూ.12 వేల నగదుతో పాటు ఐదు గ్రాముల బంగారు నగలు కనిపించలేదు. తమ లగేజీ మెట్రోస్టేషన్‌లో సెక్యూరిటీ చెకప్‌లో స్కానింగ్ చేసే క్రమంలో హ్యాండ్‌బ్యాగ్ నుంచి మాయమై ఉంటాయని అనుమానం వ్యక్తం చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. మెట్రో స్టేషన్ సెక్యూరిటీ స్కానింగ్ సిబ్బందిని విచారించాలని కోరారు. క్రైమ్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి దుర్మరణం

నాంపల్లి: రైలు ఢీకొని ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన నాంపల్లి జీఆర్పీ పోలీసు స్టేషన్ పరిధిలో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఓ గుర్తు తెలియని వ్యక్తి (65) చందానగర్–హఫీజ్‌పేట రైల్వే స్టేషన్ల మధ్యలో రైలు పట్టాలు దాటుతుండగా అటుగా వచ్చిన గుర్తు తెలియని రైలు ఢీకొట్టింది. ఈ ఘటనలో అతను అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. మృతుడి ఒంటిపై తెలుగు, ఎరుపు గీతల చొక్కా, నీలం రంగు ప్యాంట్ ధరించినట్లు పోలీసులు తెలిపారు. సంబంధీకులెవరైనా నాంపల్లి జీఆర్పీ పోలీసులను లేదా 9000394635 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

'నిధులు విడుదల చేసే వరకు తాళాలు తీయం'

ఉస్మానియా యూనివర్సిటీ: విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేసే వరకు కాలేజీలకు వేసిన తాళాలు తీసేది లేదని ప్రైవేటు డిగ్రీ, పీజీ యజమానుల సంఘం నాయకులు స్పష్టం చేశారు. మంగళవారం ఓయూ క్యాంపస్ దూరవిద్య కేంద్రం ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన సమావేశంలో సంఘం నాయకులు మాట్లాడుతూ కాలేజీల నిరవధిక బంద్ సంపూర్ణంగా కొనసాగుతుందన్నారు. నిధులు విడుదల చేసే వరకు సంఘటితంగా ఉండాలని, విద్యార్థులకు బోధన, ఇతర సేవలను అందించకూడదని నిర్ణయించారు. విద్యార్థుల ఫీజులు చెల్లించనందున ఆర్థిక ఇబ్బందులతో కొట్టుమిట్టాడుతున్న ప్రైవేటు కాలేజీల నిర్వహణ కష్టతరంగా మారిందన్నారు ప్రభుత్వం స్పందించి తక్షణమే నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అధ్యక్షులు సీతారామిరెడ్డి, ప్రధాన కార్యదర్శి ఈరబోయిన నరసింహయాదవ్, వర్కింగ్ ప్రెసిడెంట్ పరమేష్, సలహాదారులు సిద్దార్థ నాగయ్య, నరేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దక్షిణమధ్య రైల్వేలో ముగిసిన స్వచ్ఛత పఖ్వాడ్

- 15 రోజుల్లో 5,191 కిలోమీటర్ల రైల్వే ట్రాక్ శుభ్రం
- 73,536 మొక్కలు నాటిన అధికారులు, ఉద్యోగులు..



సాక్షి, సిటీబ్యూరో: దక్షిణమధ్య రైల్వేలో స్వచ్ఛత పఖ్వాడ్ విజయవంతంగా ముగిసింది.స్వచ్ఛ భారత్ మిషన్ 10 వ వార్షికోత్సవం సందర్భంగా స్వచ్ఛతను సంస్థాగతీకరించడం , కార్యాలయ పరిశుభ్రతను పెంపొందించడం, స్థిరమైన పద్ధతులను ప్రోత్సహించడం వంటి కార్యక్రమాలను చేపట్టారు. పెండింగ్ సమస్యల పరిష్కారాన్ని కూడా పరిగణనలోకి తీసుకున్నారు. ఇందులో భాగంగానే దక్షిణ మధ్య రైల్వే ఈ నెల 1 నుంచి 15 వరకు 'స్వభావ స్వచ్ఛత – సంస్కార్ స్వచ్ఛత' అనే నేపథ్యంతో స్వచ్ఛత పఖ్వాడ్ నిర్వహించింది. అధికారులు, ఉద్యోగులు, వారి కుటుంబాలు, పిల్లలు, పెద్దలు ఈ ఉద్యమంలో పాల్గొన్నారు. పక్షం రోజుల పాటు పరిశుభ్రత ప్రచారం చేపట్టారు. 636 రైల్వేస్టేషన్లలో పరిశుభ్రతను మెరుగుపరచడానికి, ప్రజా చైతన్య కార్యక్రమాలు నిర్వహించారు.జోన్‌వ్యాప్తంగా మొత్తం 5,196 కిలోమీటర్ల రైల్వే ట్రాక్‌ను శుభ్రం చేశారు. వివిధ రైల్వే ప్రాంగణాల్లో అధికారులు, సిబ్బంది, పాఠశాల విద్యార్థులు, తదితరులు సుమారు 36,183 మంది శ్రమదాన్‌లో పాల్గొన్నారు. 183 రైళ్లలో అధికారులు క్రమం తప్పకుండా పరిశుభ్రతపై తనిఖీలు నిర్వహించారు. యాంటీ లిటరింగ్ డ్రైవ్‌లో భాగంగా, రైల్వే స్టేషన్‌లు, రైళ్లలో చెత్త వేయకుండా చర్యలు చేపట్టారు. 5,010 మందికి కౌన్సెలింగ్ నిర్వహించారు. అలాగే చెత్త వేసిన 283 మందికి జరిమానా విధించి రూ . 56,600 వసూలు చేశారు.దక్షిణ మధ్య రైల్వేలోని అన్ని డివిజన్‌లు, వర్క్‌షాప్‌లలో 73,836 చెట్లను నాటినట్లు అధికారులు తెలిపారు.రైల్వే ట్రాక్‌లు, వివిధ రైల్వే ప్రాంగణాల నుంచి మొత్తం 27.44 టన్నుల ప్లాస్టిక్‌ను తొలగించారు.వర్క్‌షాప్‌ల నుంచి 430 టన్నుల స్క్రాప్‌ను సేకరించారు. స్వచ్ఛ పరిసర కార్యక్రమంలో భాగంగా జోన్ వ్యాప్తంగా 1,522 కార్యాలయాల్లో స్వచ్ఛతను పాటించి 443 టన్నుల వ్యర్థాలను సేకరించినట్లు సీపీఆర్వో శ్రీధర్ చెప్పారు.అలాగే సామాజిక మాధ్యమాల ద్వారా విస్తృత అవగాహన కల్పించారు. యువతను భాగస్వాములను చేశారు. స్వచ్ఛత పఖ్వాడ్‌లో పాల్గొన్న అధికారులు, ఉద్యోగులు, యువతీ యువకులు, విద్యార్థులకు దక్షిణమధ్య రైల్వే జనరల్‌మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ అభినందనలు తెలిపారు.

సమష్టి కృషితోనే డ్రగ్స్ నియంత్రణ

- నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్‌పై కఠినంగా వ్యవహరించాలి..
- రంగారెడ్డి డిప్యూటీ కమిషనర్ దశరథ్

సాక్షి, సిటీబ్యూరో: సమష్టి కృషితోనే డ్రగ్స్ నియంత్రణ సాధ్యమని రంగారెడ్డి జిల్లా డిప్యూటీ ఎక్సైజ్ కమిషనర్ పి.దశరథ్ అన్నారు. ఇందుకుగాను ఎక్సైజ్ అధికారులు, సిబ్బంది, జిల్లా టాస్క్‌ఫోర్స్ టీమ్‌లు పటిష్టమై నిఘా కొనసాగించాలన్నారు. నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్‌పైన ఉక్కు పాదం మోపాలని అదేశించారు. మంగళవారం అబ్కారీ భవన్‌లో రంగారెడ్డి జిల్లా ఎక్సైజ్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత నెలలో నాటుసారా తయారీ కేంద్రాలపై దాడులు నిర్వహించి 56 కేసులు నమోదు చేశామని, 53 మందిని అరెస్టు చేసి 111 లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. టు సారాను పూర్తి స్థాయిలో అరికట్టేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. వివిధ ప్రాంతాల్లో దాడులు నిర్వహించి 81 లీటర్ల నాన్ డ్యూటి పెయిడ్ లిక్కర్‌ను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.పలు ప్రాంతాల్లో ఖాళీ సీసాల్లో కల్తీ మద్యం నింపి అమ్మకాలు జరుపుతున్నారు. వీటికి తోడు కర్ణాటక ప్రాంతం నుంచి వచ్చే ఎన్‌డీపీఎల్ మద్యం సరఫరాను అరికట్టాలన్నారు. ఎయిర్‌పోర్ట్ ప్రాంతాల్లో గట్టి నిఘా పెట్టాలని ఆయన ఆదేశించారు. ఇప్పటివరకు 210 కిలోల గంజాయి, నాలుగు కిలోల గంజాయి చాక్లెట్లు, 3 కిలోల హషిష్ ఆయిల్, 6.4 గ్రాముల ఎండీఎంఏ డ్రగ్స్‌ను పట్టుకున్నట్లు చెప్పారు. సమావేశంలో అసిస్టెంట్ కమిషనర్ ఆర్ కిషన్, శంషాబాద్, మేడ్చల్, మల్కాజ్‌గిరి,సరూర్‌నగర్, వికారాబాద్ ఎక్సైజ్ సూపరింటెండెంట్లు కృష్ణప్రియ, ఎస్‌కె ఫయాజొద్దీన్, కె. నవీన్‌కుమార్, ఎస్. ఉజ్వలరెడ్డి, కె. విజయ భాస్కర్‌తో పాటు ఏఈఎస్‌లు, డీటీఎఫ్ టీమ్, 20 ఎక్సైజ్ స్టేషన్ల సీఐలు పాల్గొన్నారు.

హత్య కేసులో నిందితులకు రిమాండ్



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ కోట్ల వెంకట్‌రెడ్డి

అబిడ్స్: ధూల్‌పేట్ టక్కరివాడి ప్రాంతంలో జరిగిన హత్యకేసును మంగళ్‌హాట్ పోలీసులు ఛేదించారు. మంగళ్‌హాట్ పోలీస్‌స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్ మహేష్ గౌడ్, క్రైమ్ ఇన్‌స్పెక్టర్ మహేందర్‌లతో కలిసి గోషామహల్ ఏసీపీ కోట్ల వెంకట్‌రెడ్డి మంగళవారం వివరాలు వెల్లడించారు. లోయర్ ధూల్‌పేట బడీగల్లీ లాలా తాలీమ్ ప్రాంతానికి చెందిన దుర్గేష్‌సింగ్‌కు అతని సమీప బంధువులైన ఠాకూర్, భజరంగ్‌సింగ్, తుల్జారామ్‌సింగ్, సత్యనారాయణసింగ్ మధ్య భూవివాదం కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో దుర్గేష్‌సింగ్‌ను హతమార్చాలని నిర్ణయించుకున్న వారు ఈ నెల 13న రాత్రి అతని ఇంటిపై దాడి చేసి హత్య చేశారు. మృతుడి సోదరుడి ఫిర్యాదు మేరకు నమో దు చేసిన మంగళ్‌హాట్ పోలీసులు మంగళవారం నిందితులు ఠాకూర్ భజరంగ్‌సింగ్, సత్యనారాయణసింగ్‌లను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. రిమాండ్‌కుఆదేశిస్తూన్యాయమూర్తి ఉత్తర్వులు జారీ చేశారు.